

ఇటీవల కురిసిన వర్షాలతో బురదమయంగా మారిన భద్రకాళీ చెరువు

# ప్రణాళికా లోపం పూడికతీత సగమే!

## వర్షంతో భద్రకాళీ చెరువు పనులకు ఆటంకం

*రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణ లోపం, జిల్లా ఉన్నతాధికారుల అలసత్వంతో భద్రకాళీ చెరువు సుందరీకరణ ప్రాజెక్టు అయోమయంలో పడింది. సరైన ప్రణాళిక లేక చెరువు పూడికతీత పనులు సగంలోనే ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. అయితే వానకాలంలోపే పూడిక మట్టినంతా తీసివేయాల్సి ఉండగా ఇప్పటికి 30 శాతం పనులే పూర్తికాలేదు. 18లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 6.40 లక్షల క్యూబిక్ మీటర్లు మాత్రమే పూడికతీయగా ఇటీవలి వర్షాలతో వారం రోజులుగా పనులు మొత్తానికే నిలిచిపోయాయి. ఇక జోరు వానలు కురిస్తే మళ్లీ పూడికతీయడం అనుమానంగా కనిపిస్తోంది. ఓ వైపు చెరువులో పూడిక అలాగే ఉన్న నేపథ్యంలో భద్రకాళీ చెరువు అభివృద్ధి, సుందరీకరణ అమలుపై అయోమయం నెలకొన్నది. పూడికకు మార్చి, ఏప్రిల్ నెలల్లో అనుకూల వాతావరణం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు తాత్సారం చేయడం వల్లే రెండున్నర నెలలైనా పూడికతీత పూర్తికాలేదని, స్వయంగా మంత్రులు ఆదేశించినప్పటికీ సగం పనులే చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.*

**- వరంగల్, మే 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

- 18 లక్షల క్యూబిక్ మీటర్లు తీయడం లక్ష్యం
- ఇప్పటికి తీసింది 6.40 లక్షల క్యూబిక్ మీటర్లే..
- వానకాలం వచ్చినా 30శాతమే పనులు
- రెండున్నర నెలలైనా పూర్తికాని ప్రక్రియ
- మళ్లీ మొదలయ్యేది అనుమానమే

వర్షాకాలం మొదలయ్యేలోపు భద్రకాళీ చెరువు పూడికతీత పూర్తి చేయాలనే లక్ష్యం మేరకు ఎక్కడా పనులు జరగలేదు. రెండున్నర నెలల క్రితం పనులు మొదలుపెట్టినా ఇప్పటికీ సగం కూడా కాలేదు. 382 ఎకరాల విస్తీర్ణం కలిగిన భద్రకాళీ చెరువు పూడికతీత పనులు చేపట్టాలని ప్రభుత్వం గత నవంబర్‌లో నిర్ణయించింది. హడావుడిగా చెరువులోని నీటిని ఖాళీ చేయించింది. 18లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక తీత ఉన్నట్లు నిర్ధారించిన సాగునీటి శాఖ మార్చిలో పూడికతీత పనులు ప్రారంభించింది. చెరువును మొత్తం 5 జోన్లుగా విభజించి తొలుత మూడు జోన్లలో పూడిక తీసి మట్టిని తరలించాలని నిర్ణయించారు. అయితే మార్చి 11న పూడికతీత మొదలైనా జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు అనుకున్నట్లు జరుగలేదు. సాగునీటి శాఖ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 3.40 లక్షల క్యూబిక్ మీటర్ల కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) మరో 3 లక్షల క్యూబిక్ మీటర్లు పూడిక తీశాయి. చెరువు పక్కనే మాడ వీధులు నిర్మిస్తున్న క్రమంలో ఈ మట్టిని అక్కడికి తరలించారు. మాఢవీధుల పనులు కుడా ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. సాగునీటి శాఖ, కుడా కలిపి మొత్తంగా ఇప్పటి వరకు 6.40 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి మాత్రమే తీయగా మిగతా పూడికతీత విషయంలో స్పష్టత కరువైంది.



### మంత్రులు చెప్పినా కానరాని పురోగతి

పూడికతీత పనులను ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి కొండా సురేఖ స్వయంగా పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చినా ఎలాంటి పురోగతి కనిపించలేదు. జిల్లా ఉన్నతాధికారులు ప్రణాళిక ప్రకారం వ్యవహరించకపోవడం వల్లే పూడికతీత పూర్తి కాలేకపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రెండున్నర నెలల్లో 3.40 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక మాత్రమే తీయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మార్చి, ఏప్రిల్‌తో పాటు మే మూడు వారాల్లోనూ పూడిక తీసేందుకు అనుకూల వాతావరణం ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్లే పనులు కాలేదనే విమర్శలు ఉన్నాయి. కొద్దిరోజులుగా వరుసగా వర్షాలు పడుతుండడం, చెరువు అడుగు భాగమంతా తేమగా మారడం, బురద ఉన్న కారణంగా టిప్పర్లు చెరువులోకి దిగలేని పరిస్థితి ఉంది. ఈ క్రమంలో మిగిలి ఉన్న 14.60 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక మట్టిని ఏం చేస్తారనేది తెలియడం లేదు. పూడిక తీయనిదే భద్రకాళీ చెరువు సుందరీకరణ పనులు ముందుకు సాగే అవకాశం లేదు. భద్రకాళీ ఆలయ మాఢ వీధుల నిర్మాణం, చెరువులో బోటింగ్, ట్యాంక్ బండ్ విస్తరణ అన్ని పనులకు ఇప్పుడు అడ్డంకులు ఏర్పడే పరిస్థితి వచ్చింది.



మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మొండ్రాయిగూడెం వద్ద కొట్టుకపోయిన తాత్కాలిక రోడ్డు

# వరద ఉధృతికి తెగిన రోడ్లు..


## ఏటూరునాగారం, కొత్తగూడ మండలాల్లోని గ్రామాలకు రాకపోకలు బంద్

ఏటూరునాగారం/కొత్తగూడ, మే 28 : వరద ఉధృతికి ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం దొడ్ల–కొండాయి మధ్యనున్న జంపన్నవాగుపై, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మొండ్రాయిగూడెం వాగుపై నిర్మించిన తాత్కాలిక రోడ్లు మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తెగిపోయాయి. రెండేళ్ల క్రితం వచ్చిన వరదలకు జంపన్నవాగుపై ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోగా, అప్పటి నుంచి వర్షాకాలంలో రవాణా సౌకర్యం కష్టంగానే ఉన్నది. గతేడాది ఐరన్ ఫుట్ బ్రిడ్జి నిర్మించేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. మినీ జాతర సందర్భంగా తాత్కాలిక రోడ్డు నిర్మించగా, అది కొండాయి, మల్యాల గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉండగా అది కాస్తా తెగిపోయింది. దీంతో మల్యాల, కొండాయి, ఐలాపూర్ గ్రామాల రవాణా స్తంభించింది. నిత్యావసర సరుకులు, వైద్యం కోసం రావాలంటే గిరిజన గ్రామాల ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది. అధికారులు తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా వాగు దాటేందుకు అగ్నిమాపక అధికారులు ఇంజిన్ బోటును సమకూర్చారు. వాగు వద్ద ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీ పెట్టారు. వాగు ఉధృతిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు ఎంపీవో కుమార్ తెలిపారు. అలాగే కొత్తగూడ మండలం మొండ్రాయిగూడెం వాగుపై బ్రిడ్జి నిర్మాణంలో ఉండగా, తాత్కాలికంగా వేసిన రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఐదు గ్రామాలకు రాకపోకలు బందయ్యాయి. ప్రయాణికులెవరూ ఇక్కడి నుంచి ప్రయాణించకుండా ఎంచగూడెం మీదుగా వెళ్లాల్సిందిగా కాంట్రాక్టర్ తెలిపారు. బ్రిడ్జి నిర్మాణంలో ఉండడంతో సిమెంట్, ఇతర వస్తువులు, మోటర్లు వాగులో కొట్టుకపోయాయని, సుమారు రూ. 15లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు.



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని జంపన్నవాగుపై తెగిన తాత్కాలిక రోడ్డు

## సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి ప్రవాహం



గోదావరి వరద ప్రవాహంతో కళకళలాడుతున్న సమ్మక్క బరాజ్

కన్నాయిగూడెం, మే 28 : కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి నీటి మట్టం రోజురోజుకూ పెరుగుతున్నది. బుధవారం ఎగువ నుంచి 6,350 క్యూసెక్కుల వరద వస్తుండడంతో ఒక గేటును పైకెత్తి 3000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం 77 మీటర్ల ఎత్తుకు చేరుకుంది. దీంతో సమ్మక్క బరాజ్ జలకళతో చూపరులను ఆకట్టుకుంటోంది.

# ధర తగ్గించారని ఆందోళన

## కంపెనీ ప్రతినిధులతో పొగాకు రైతుల వాగ్వాదం




పోలీసు సర్కిల్ కార్యాలయం ఎదుట వేచివున్న రైతులు

హనుమకొండ సబర్బన్, మే 28 : ఒక్కసారిగా కొనుగోలు ధరను భారీగా తగ్గించారని ఆగ్రహించిన పొగాకు రైతులు ఎల్కతుర్తిలో బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల పరిధిలోని చింతలపల్లి, దామెర, ఎల్కతుర్తి గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో రైతులు ఈ ఏడాది పొగాకు పంటను సాగు చేశారు. గతేడాది ఈ పంటకు భారీగా లాభాలు రావడంతో ఈసారి చాలా మంది రైతులు మొగ్గుచూపారు. గతంలో ఈ ప్రాంతంలో వీఎస్టీ కంపెనీ రైతులతో పొగాకు పంటను సాగు చేయించి క్వింటాకు రూ.15 వేలతో కొనుగోలు చేసింది. ఈసారి కూడా అదే తరహాలో రైతులను ప్రోత్సహించినప్పటికీ పంట పూర్తయ్యాక కొనుగోలు విషయంలో కొర్రీలు పెడుతున్నదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు క్వింటాకు రూ.10 నుంచి రూ.15 వేలున్న ధరను ఒకేసారి రూ. 5, రూ. 6 వేలకు దించడంతో సుమారు 40 మంది రైతులు కంపెనీ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగడంతో పాటు ఆందోళనకు దిగారు. చివరకు ఎల్కతుర్తి ఇన్‌స్పెక్టర్ పులి రమేశ్‌ను ఆశ్రయించడంతో రాత్రి పొద్దుపోయే వరకు ఇరువర్గాలతో చర్చలు జరిపారు. చివరకు కంపెనీ ఉన్నతాధికారులతో రైతులను ముఖాముఖి మాట్లాడిస్తామన్న హామీ మేరకు ఆందోళన విరమించారు.

# కాళ్లు మొక్కినా కనికరిస్తలేరు..

- 43 రోజులుగా కాంటా పెడ్తలేరు..
- తహసీల్దార్ కాళ్లపై పడిన మహిళా రైతులు
- మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో ఘటన
- దంతాలపల్లిలోనూ కానిస్టేబుల్ కాళ్లు మొక్కిన రైతు
- మొలకెత్తిన వడ్లు కొనాలంటూ రోడ్డెక్కిన రైతులు
- జనగామ జిల్లా నర్మెటలోనూ అదే పరిస్థితి



నర్సింహులపేట : తహసీల్దార్‌కు దండం పెడుతున్న మహిళా రైతు పుష్పమ్మ

నర్సింహులపేట/దంతాలపల్లి/నర్మెట, మే 28 : 'కాళ్లు మొక్కినా కనికరిస్తలేరు.. కాసులిచ్చినోళ్లకే కాంటా పెడుతుండ్రు.. వడ్లు తీసుకొచ్చి 43 రోజులైంది.. కాంటాలు పెట్టిన బస్తాలను కూడా తరలించడం లేదు.. వానలకు ధాన్యం తడిసి మొలకెత్తుతున్నయ్.. మా వడ్లు కొనండి సారూ' అంటూ బుధవారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి వచ్చిన తహసీల్దార్ రమేశ్ కాళ్లపై పడి ఇద్దరు మహిళా రైతులు వేడుకున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించేందుకు కొనుగోలు కేంద్రానికి తహసీల్దార్ వచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని తిర్మతండాకు చెందిన భూక్యా ఈరి, భూక్యా గోరి ఆయన ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. 43 రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకొస్తే తేమ చూడలేదని, పశువులు, పంది కొక్కులతో వడ్లు మట్టిలో కలిసిపోవడంతో పాటు వానకు తడిసి మొలకొచ్చాయని కన్నీరు మున్నీరయ్యారు. అక్కడే ఉన్న రైతులు బోనస్ లేకపోయినా పర్వాలేదని.. ఉన్న వడ్లు కాంటా పెట్టాలని.. తమకు బుద్ధి వచ్చిందని, మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురామని, చెంపలు వేసుకుంటామని తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. వారం రోజులుగా పడుతున్న వర్షాలకు వడ్లు మొలకెత్తుతున్నాయని, కాంటాలు పెట్టిన బస్తాలను కూడా మిల్లులకు తరలించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నిర్వాహకులు పెడుతున్న ఇబ్బందులను వివరించారు. కాగా, రెండు మూడు రోజుల్లో కాంటాలు పెట్టిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. 45 రోజులైనా ధాన్యం కొనడం లేదని ఆగ్రహించిన రైతులు సీఎం రేవంత్‌రెడ్డి తీరును నిరసిస్తూ మొలకెత్తిన ధాన్యం బస్తాలతో దంతాలపల్లి–సూర్యాపేట రహదారిపై ఆందోళన చేపట్టారు. తడిసిన ధాన్యం, మొలకెత్తిన బస్తాలను అధికారులు తక్షణమే మిల్లులకు తరలించి ఎలాంటి కోతలు లేకుండా దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న పోలీసు సిబ్బంది ఆందోళనను అడ్డుకునేందుకు యత్నించారు. వెంటనే ఓ కానిస్టేబుల్ కాళ్లపై పడిన రైతు తమ గోడు వెళ్లబోసుకుంటున్నామని, తమను అడ్డుకోవద్దంటూ వేడుకున్నాడు. తమ బాధను ఏ అధికారి పట్టించుకోవడం లేదని, వానకాలం ప్రారంభమైనా ధాన్యం కాంటాలు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ తీరును తప్పు పట్టారు. ఆందోళన వద్దకు పీఏసీఎస్ సీఈవో వెంకన్న చేరుకొని నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. అలాగే జనగామ జిల్లా నర్మెట మండలం వెల్దండలోని కొనుగోలు కేంద్రంలోనూ కాంటాలు కాక వర్షాలకు ధాన్యం మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.




నర్మెట : వెల్దండలో మొలకెత్తిన వడ్లను చూపిస్తున్న రైతు సోమిరెడ్డి

### వడ్లు మొలకొచ్చినయ్..




కేంద్రంల కాంటా పెడుతలేరు.. వడ్లు నింపుకుంటామంటే బస్తాలు ఇస్తలేరు. వారం రోజుల సంది కురుస్తున్న వానకు పరదాల నుంచి నీళ్లు పోయి వడ్లు మొలకొచ్చినయ్. వానకాలం వచ్చింది. నారుమడులు, దుక్కులు దున్నుకోవద్దా? చెలుక పని చేసుకోవద్దా? ఇక్కడికి వచ్చి ఉండాలా? పత్తి, మిరప గింజలు పెట్టుకోవద్దా? కొనుగోలు కేంద్రం ఎందుకు పెట్టిండ్రు. సచ్చి, బతికి వడ్లు పండించుకున్నం. 50 రోజుల సంది సీరియల్ రాలేదా మాది? ఎందుకు కాంటా పెట్టరు? ఇంకోసారి ఇక్కడికి వడ్లు తీసుకొస్తే మా చెంపమీద మేమే కొట్టుకుంటం. **– భూక్యా గోరి, మహిళా రైతు, తిర్మతండా**



నర్సింహులపేట : తహసీల్దార్‌తో గోడు వెళ్లబోసుకుంటున్న రైతులు



దంతాలపల్లి : కుమ్మరికుంట్లలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు



# అసైన్డ్ భూముల్లో అడ్డగోలు దందా

## గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అక్రమ పట్టాలు

*భూ భారతి ప్రాజెక్టులో పైలట్‌గా ప్రకటించిన వెంకటాపూర్ మండలంలోని అసైన్డ్ భూముల్లో అడ్డగోలు దందాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. 2004లో కాంగ్రెస్ సర్కారు హయాంలో జవహర్‌నగర్, లింగాపూర్ కేంద్రంగా ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఎక్కడ ఉన్నాయో తెలియనప్పటికీ అక్రమార్కులు వాటికి పట్టాలు చేయించుకొని దర్జాగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అనుభవిస్తున్నారు. కాస్తులో ఉన్న రైతులకు పట్టాలు లేకపోగా వ్యవసాయం చేయని వారు అదే సర్వే నంబర్లలో పట్టాలు పొంది 15 ఏండ్లుగా ప్రజల సొమ్మును మింగుతున్నారు. ఈ అక్రమాల బాగోతాన్ని చూసి రెవెన్యూ అధికారులు సైతం నోళ్లు వెళ్లబెడుతున్నారు.*

**- ములుగు, మే 28 (నమస్తే తెలంగాణ)**

- జవహర్‌నగర్, లింగాపూర్ కేంద్రంగా దందా
- నాటి నుంచి సంక్షేమ పథకాలతో అక్రమార్కుల లబ్ధి
- పట్టా భూములు సైతం కబ్జాలు
- 'భూ భారతి'తో వెలుగులోకి వస్తున్న అక్రమాలు

భూ భారతి ప్రాజెక్టులో భాగంగా ఏప్రిల్ 18వ తేదీన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్కలు వెంకటాపూర్‌ను పైలట్ మండలంగా ప్రకటించి భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో ఈ మండలంలో అసైన్డ్, పట్టా భూములను అక్రమంగా పట్టాలు చేసుకున్న వైనం ఒక్కొక్కటికిగా బయట పడుతున్నది. 200 4లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మండలంలోని జవహర్‌నగర్, లింగాపూర్ కేంద్రంగా ప్రభుత్వ, అసైన్డ్ భూములను అక్రమార్కులు అందిన కాడికి దండుకున్నారు. రైతుల మాదిరిగా బ్యాంకుల నుంచి రుణాలు పొందుతూ రుణమాఫీ పథకాన్ని కూడా వర్తింపజేసుకున్నారు. భూ భారతి చట్టంలో భాగంగా కాస్తులో ఉన్న రైతులు పట్టా కావాలని కోరుతూ అధికారులకు ఇటీవల దరఖాస్తులు చేయడంతో సదరు భూమికి గతంలోనే పట్టా పొంది ఉన్న వారి పేర్లు తొలగించేందుకు రెవెన్యూ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### భూ భారతితో బట్టబయలవుతున్న అక్రమాలు

గతంలో ప్రభుత్వ భూములను పట్టాలు చేసుకున్న అక్రమార్కులు ప్రస్తుతం అవి ఎక్కడ ఉన్నాయో సర్వే నిర్వహించాలని రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. అధికా రులు, అక్రమార్కులు సదరు భూముల వద్దకు వెళ్లగా అప్పటికే కాస్తులో ఉన్న రైతులు ఎదురు తిరగడంతో గొడవలు జరుగుతున్నాయి. అసైన్డ్ పట్టా ఇచ్చే క్రమంలో లబ్ధిదారులకు భూమిని చూపించి పట్టాలు మంజూరు చేయాల్సి ఉండగా అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వ భూమిని అక్రమార్కులకు రాసి ఇచ్చి ముడుపులు తీసుకున్నారు. చట్టం ప్రకారం పట్టా పొందిన తర్వాత రెండేళ్ల లోపు భూమిని సాగు చేసుకోని క్రమంలో నిబంధనల మేరకు ప్రభుత్వం స్వా ధీనం చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో పాటు వెంకటాపూర్‌కు చెందిన పట్టా భూములు కొందరికి జవహర్ నగర్ పరిధిలో ఉండగా ఆ భూములను సైతం కొందరు అక్రమంగా పట్టాలు చేసుకొని విక్రయాలు సైతం జరిపారు. అసలు పట్టాదారులు అమ్ముకున్నా, సాగులో, మోకా మీద లేకున్నా సదరు భూములను అక్రమార్కులు వారు, వారి కుటుంబ సభ్యుల పేరు మీద పట్టాలు చేయించుకొని ఇతరులకు అమ్మకాలు సైతం జరిపారు. లక్ష్మీదేవిపేట, నల్లగుంట గ్రామాల్లో సైతం ఇలాంటి అక్రమ పట్టాల బాగోతం ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. ఈ విషయమై వెంకటాపూర్ తహసీల్దార్‌ను వివరణ కోరగా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదుల ప్రకారం ప్రభుత్వ భూములు అని తేలితే విచారణ చేస్తామన్నారు. ప్రభుత్వ భూములను కొనుగోలు చేసిన వారి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు.

### రెండు గ్రామాల్లో దందా..

నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో లింగాపూర్ గ్రామం జవహర్‌నగర్‌లో విలీనం కాగా, రాష్ట్ర ఏర్పాటు తర్వాత లింగాపూర్ కూడా నూతన గ్రామపంచాయతీగా అవతరించింది. ప్రస్తుతం ములుగు జిల్లాలో ఈ రెండు గ్రామాల్లో వేలాది ఎకరాల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఉన్నాయి. భూ భారతిలో భాగంగా ఈ రెండు గ్రామాల నుంచి ఎక్కువ మొత్తంలో పట్టాల కోసం ఫిర్యాదు అందినట్లు తెలుస్తున్నది. 2004లో ములుగు ఆర్డీవో ద్వారా అక్రమంగా తమ కుటుంబ సభ్యుల పేరుపై పట్టాలు పొందిన పలువురికి భూమి ఎక్కడ ఉన్నదో తెలియనప్పటికి ఇందిరా జల ప్రభ పథకంతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలను పొందుతూ వస్తున్నారు.